క్లుప్తంగా

నగరంలో 132 కేవీ సబ్‌స్టేషన్

• సీఎండీ సంతోషరావు



అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో త్వరలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అన్నారు. ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు టౌన్ డివిజన్‌కు సంబంధించి పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని, దీనికి సంబంధించిన శంకుస్థాపన పనులు త్వరలో చేయనున్నామని వివరించారు. అదేవిధంగా గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఎస్పీడీసీఎల్ పరిధిలో ఎక్కడా లేని విధంగా మొదటిసారిగా కంటైనర్ సబ్‌స్టేషన్‌ను మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం నగరంలోని రేబాలవారి వీధిలో ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి జిల్లాలో జరుగుతున్న విద్యుత్ శాఖ అభివృద్ధి పనులపై మంత్రి నారాయణతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఈ విజయన్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ బాలకేశవులు, డీఈటీ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, పరంధామయ్య, డిప్యూటీ ఈఈలు అశోక్, సునీల్, కిరణ్, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐదు కిలోల కేన్సర్ గడ్డ తొలగింపు

• ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్



కేన్సర్ గడ్డను తొలగిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఓ మహిళకు అరుదైన ఆపరేషన్ చేసి ఐదు కిలోలకుపైగా ఉన్న కేన్సర్ గడ్డను శనివారం తొలగించారు. నగరంలోని నవాబుపేటకు చెందిన 32 ఏళ్ల నస్రీన్ కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా, డాక్టర్లు గర్భసంచిలో గడ్డ ఉన్నట్టు చెప్పి ఆపరేషన్‌కు దాదాపు రూ.లక్ష కావచ్చని చెప్పారు. పేదరాలైన ఆ మహిళ ప్రభుత్వ పెద్దాస్పత్రికి వచ్చింది. సర్జికల్ అంకాలజిస్ట్ వరుణ్ సారథ్యంలో వైద్యులు విజయలక్ష్మి, యశ్వంత్‌లతో పాటు అనస్థీషియన్ ఖాదర్‌బాషా బృందంగా ఏర్పడి ఆమెకు సర్జరీ విజయవంతంగా చేశారు. కేన్సర్ గడ్డతో పాటు భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా గర్భసంచిని తొలగించారు. ఈ సందర్భంగా అంకాలజిస్ట్ వరుణ్ మాట్లాడుతూ ఇక్కడ అన్నిరకాల కేన్సర్‌లకు ఖర్చులేకుండా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

క్రమశిక్షణతో కష్టపడితే ఉన్నత శిఖరాలు

• రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డి



వేదికపై జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జిల్లా జడ్జి యామిని, బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి

నెల్లూరు (లీగల్) : జూనియర్ న్యాయవాదులు క్రమశిక్షణతో కష్టపడితే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కనకంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో నెల్లూరు బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. సీనియర్ న్యాయవాదులు నిరంతరం చదువుతూ క్రమశిక్షణ, నైతిక విలువలను పాటిస్తూ న్యాయవాద వృత్తిలో రాణించాలన్నారు. సమన్వయంతో పనిచేస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తొలుత ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి, ఇటీవల మృతిచెందిన న్యాయవాదుల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాదులను సన్మానం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు ఎంతో సహకారం అందించారన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు, జిల్లాలోని పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

• నిర్వహణ భారంగా ఉందని పక్కన పెట్టేసిన అధికారులు
• బుచ్చిలో వీడని దోమల బెడద



రూమ్‌కే పరిమితమైన ఫాగింగ్ యంత్రాలు

బుచ్చిరెడ్డిపాళెం : ఓ పక్క ఎండలు.. మరో పక్క దోమలపోటుతో బుచ్చిరెడ్డిపాళెం నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎంతో అట్టహాసంగా దోమల నివారణ కోసం లక్షలాది రూపాయల వ్యయంతో ఫాగింగ్ యంత్రాలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. అయితే కనీసం వాటి ద్వారా ఒక్కనెల కూడా బుచ్చిరెడ్డిపాళెంలో దోమల నివారణ కోసం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

రూ.లక్షలు వెచ్చించి..

గతంలో పనిచేసిన ఇద్దరు కమిషనర్లలో ఒకరు చిలకలూరిపేట నుంచి ఓ కాంట్రాక్టర్ ద్వారా సుమారు రూ.6 లక్షల వ్యయంతో ఫాగింగ్ మెషీన్ను తెప్పించారు. తదనంతరం వచ్చిన మరో కమిషనర్ మరో నాలుగు లక్షలతో కనిగిరి నుంచి మరో కొత్త వాహనాన్ని తెప్పించారు. అయితే ఇద్దరు కమిషనర్లు ఉన్నంత వరకూ రోజూ సాయంత్రం పూట ఓ అరగంట సేపు చెన్నూరు రోడ్డులో మాత్రమే స్ప్రే చేయించేవారు. ఇలా 20 రోజులకే మెషీన్లను అతి జాగ్రత్తగా రూముకే పరిమితం చేశారు. దోమలు అధికమవడంతో ప్రజలు గగ్గోలు పెట్టగా గత బుధవారం నుంచి స్ప్రేయర్‌తో మురుగు కాలువల్లో పిచికారీ చేస్తూ ఆయిల్ బాల్స్‌ను వదులుతూ చేతులు దులుపుకుంటున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో కొనుగోలు చేసినా ఫాగింగ్ మెషీన్ల వల్ల నగర ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకపోగా ప్రజలపై మాత్రం లక్షల రూపాయల భారం పడింది.

నిధుల కొరతతో వినియోగించడం లేదు



"ఫాగింగ్ మెషీన్ల నిర్వాహణ వ్యయం అధికంగా ఉంది. ప్రస్తుతం నగర పంచాయతీలో నిధుల కొరత ఎక్కువగా ఉంది. దీనివల్ల ఫాగింగ్ యంత్రాలను వినియోగించలేకున్నాం. అయితే ప్రస్తుతం దోమల నివారణ కోసం ట్రాక్టర్ ద్వారా కాలువల్లో మందును పిచికారీ చేయడం, ఆయిల్ బాల్స్ వదలడం లాంటివి చేస్తున్నాం.

– బాలకృష్ణ, కమిషనర్

చేపల వినియోగంపై ర్యాలీ



ముత్తుకూరు: చేపలను భుజించడం, పెంపకంతో అనేక ప్రయోజనాలున్నాయని మత్స్యకళాశాల ఎన్నెస్సెస్ అధికారులు డాక్టర్ త్రివేణి, శ్రీవిద్య పేర్కొన్నారు. మండలంలోని మల్లూరులో గల మత్స్య కళాశాలలో నాలుగో సంవత్సర బీఎఫ్ఎస్సీ విద్యార్థులు ఎన్నెస్సెస్ స్పెషల్ క్యాంప్‌ను శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా అవగాహన ర్యాలీని జరిపారు. చేపల పెంపకంలో నెలకొన్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు.

భూమికి హక్కులు కల్పించాలని వినతి



న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి, విజయ దంపతులు

తోటపల్లిగూడూరు: వంశపారంపర్యంగా తమ కుటుంబసభ్యుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమికి హక్కులు కల్పించి తమకు న్యాయం చేయాలని ఈదూరుకు చెందిన పోలంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, విజయ దంపతులు కోరారు. ఈ మేరకు విలేకరులతో శనివారం వారు మాట్లాడారు. ఈదూరు బిట్ – 2 సర్వే నంబర్‌లో 84.. 827 – 2లో 28 సెంట్లు.. 825లో 1.30 ఎకరాలు, 860 – ఏ2లో 1.08 ఎకరాలు, 860 – సీలో 23 సెంట్లు తమకు వంశపారంపర్యంగా దక్కాయని, దీనికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. కొన్నేళ్లుగా లీజుకు తీసుకొని సాగు చేసుకుంటున్న తమ దాయాదులైన కొందరు ఆ భూములను ఆక్రమించుకొని సొంతం చేసుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే, అధికార బలంతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు న్యాయం చేయాలని కోరారు.

నీటి ఎద్దడి రాకుండా చూడండి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసులు

ఇందుకూరుపేట : వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు అన్నారు. ఎంపీపీ గంధళ్ల శేషయ్య ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, ఈఓపీఆర్డీ పెంచల శ్యామ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి బట్టేపాటి పరామర్శ



ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని పార్టీ రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి శనివారం పరామర్శించారు. సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుబ్బారెడ్డి స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని సోమవరప్పాడులోని ఆయన నివాసానికి నరేంద్రరెడ్డి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నేత షేక్.షబ్బీర్ ఉన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని ముంబై హైవే గ్లోబల్ స్కూల్ వద్ద బైక్ ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పటాన్ జక్రి అహ్మద్ అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా బుచ్చిరెడ్డిపాళెం వైపు మద్యం మత్తులో ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి ఢీకొట్టారు. దీంతో జక్రీ అహ్మద్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ముగ్గురు యువకులతో పాటు బైక్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు కృషి



బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక నాయకుల కోరిక మేరకు దివంగత ఎన్టీ రామారావు విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె శనివారం పాల్గొని, మాట్లాడారు. అనంతరం గత ప్రభుత్వం మంజూరు చేసిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పథకం కింద రెండు ట్రాక్టర్లను ప్రారంభించారు. అందులో ఒకటి మినగల్లు గ్రామ పంచాయతీకి, మరొకటి పెనుబల్లి గ్రామ పంచాయతీకి కేటాయించినట్లు తెలిపారు. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పార్టీ నాయకులు ఎంవీ శేషయ్య, టి.మల్లికార్జున్‌రెడ్డి, బి.హరికృష్ణ, కౌన్సిలర్ హరనాథ్, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న వజ్రమ్మ

మనుబోలు: గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గుండాల వజ్రమ్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించి.. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ జలజాక్షి మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వెలుగుతున్నాయాననే అంశాలను పరిశీలించాలని చెప్పారు. రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టామని తహసీల్దార్ సుబ్బయ్య పేర్కొన్నారు. రీ సర్వేతో భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు



పొదలకూరు: అమరావతి స్కూల్లో..

పొదలకూరు: విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలను పట్టణంలోని అమరావతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం నిర్వహించారు. అరటి పిలకలు, మామిడి తోరణాలతో పాఠశాలను అలంకరించారు. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. కరస్పాండెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

• పట్టణంలోని విజేత స్కూల్లో ఉగాది వేడుకలను నిర్వహించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని విద్యార్థులకు తినిపించారు. కరస్పాండెంట్ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో గల బ్రిలియంట్ చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్లో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఉగాది పచ్చడిని విద్యార్థులు చేసి ఉపాధ్యాయులకు తినిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కరస్పాండెంట్ రూబీ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: విజేతలో..



వెంకటాచలం: బ్రిలియంట్ స్కూల్లో..

పౌరహక్కులపై అవగాహన అవసరం




మాట్లాడుతున్న సుబ్బయ్య

మనుబోలు: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సుబ్బయ్య పేర్కొన్నారు. మండలంలోని జట్లకొండూరు పంచాయతీ పరిధిలో గల జ్యోతినగర్‌లో పౌరహక్కులపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను అందరూ తెలుసుకోవాలని కోరారు. హక్కులను కాపాడుకోవడంతో పాటు బాధ్యతలను గుర్తెరిగి మెలగాలని సూచించారు. ఆర్‌ఐ శ్రీకాంత్, వీఆర్వో సురేంద్ర, ఉప సర్పంచ్ అవుల తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి కళాత్మక స్వాగతం





పొదలకూరు: ఉగాదిని పురస్కరించుకొని పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య కళాత్మకంగా శుభాకాంక్షలను తెలియజేశారు. మర్రి ఆకుపై ఉగాదిని కళాత్మకంగా తీర్చిదిద్దారు.

ముత్తుకూరు: ఉగాది పర్వదిన విశిష్టతను తెలియజేస్తూ అట్టముక్కలు, వాటర్ కలర్స్‌తో నమూనాను మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం రూపొందించారు. ఉగాదిని సుఖసంతోషాలతో జరుపుకోవాలని కాంక్షించారు.

రైతులందరూ విశిష్ట సంఖ్య పొందాలి

కొడవలూరు : సొంత పొలమున్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య పొందాలని ఏఓ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. విశిష్ట సంఖ్య ఉన్న రైతు మాత్రమే ప్రభుత్వపరంగా గుర్తింపు పొందుతారన్నారు. మండలంలో 5,060 మంది రైతులు విశిష్ట సంఖ్య పొందాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 3,300 మంది మాత్రమే వీటిని పొందినట్లు వివరించారు. మండలంలో పొలం కలిగి బయటి ప్రాంతాల్లో ఉంటున్న వారు విశిష్ట సంఖ్య పొందడం లేదన్నారు. వారు స్వగ్రామంలో స్థానిక రైతు సేవా కేంద్రంలో వీఏఏను సంప్రదించి విశిష్ట సంఖ్య పొందాలన్నారు.

ఇఫ్తార్ విందు

ముత్తుకూరు: ముత్తుకూరులో టీడీపీకి చెందిన ముస్లిం మైనార్టీలు శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నేతలు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్ షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

మనుబోలు: రంజాన్‌ను పురస్కరించుకొని మండలంలోని అక్కంపేటలో గ్రామస్తులకు చీరలను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నేత అమీర్‌బాషా ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. నేతలు గాలి రామకృష్ణారెడ్డి, వెందోటి భాస్కర్‌రెడ్డి, కలికి వేణుగోపాల్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన హరీష్ నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బ్రెయిన్ సర్జరీ చేయాలని డాక్టర్లు తెలపడంతో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న హరీష్ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన వారు రూ.51 వేలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధి ముగపాటి రమేష్, బుధవారపు బాలాజీ, సోమా గోపాల్, గుత్తికొండ శ్రీనివాసరావు, చింతలపూడి పెంచలయ్య పాల్గొన్నారు.